క్లుప్తంగా

భరోసా ఇచ్చిన మేనిఫెస్టో



నక్కపల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేయగలిగినవే మేనిఫెస్టోలో ప్రకటించడం జరిగిందని పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. చంద్రబాబు మాదిరిగా ప్రజలను మోసం చేయడం జగన్‌కు చేతకాదన్నారు. 2014లో బూటకపు వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హామీలు నెరవేర్చలేదు కాబట్టే 2019లో ప్రజలు టీడీపీని 23 సీట్లకే పరిమితం చేశారన్నారు. జగనన్న నవరత్నాలను కొనసాగిస్తూనే కొన్ని పథకాలకు ఆర్థిక సాయాన్ని పెంచడం జరిగిందని, ప్రస్తుతం ఇస్తున్న పథకాలన్నీ మరో ఐదేళ్లపాటు నిరాటంకంగా కొనసాగిస్తానని జగనన్న భరోసా ఇచ్చారని కొనియాడారు.

నేడు పది గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రచారం

మాకవరపాలెం: మండలంలోని పది గ్రామాల్లో ఆదివారం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు శనివారం మాట్లాడుతూ మల్లవరం, గిడుతూరు, బయ్యవరం, పి.పి.అగ్రహారం, ఎస్.ఆర్.పేట, పి.పి.అగ్రహారం, జంగాలపల్లి, కొండలఅగ్రహారం, జి.గంగవరం, వజ్రగడ గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం చేస్తారన్నారు. ఈ ప్రచారాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

ప్రతి నోటా జగనన్న మాటే..



గుర్రాజుపేట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : ప్రతి పేదవాడి నోటా జగన్ మాటేగా వినపడుతోందని వైఎస్సార్‌సీపీ మండల మహిళా నాయకులు, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి అన్నారు. గుర్రాజుపేట, పెదఉప్పలం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కంబాల జోగులకు మద్దతుగా శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ఫ్యాను ఓటు వేయాలని అడిగారు. ఇంతవరకు మాకు మేలు చేసిన నాయకులు జగన్ బాబేనని మేము ఎలా మరచిపోతామని, ఫ్యాన్ గుర్తుకే మా ఓటని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జోనల్ కంబాల జోగులు, సర్పంచ్‌లు కోశెట్టి వెంకటరమణ, రత్నం, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపీటీసీ కేసుబోయిన వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు దాట్ల రామరాజు, కొర్ని రాజారమేష్ పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

ఎస్.రాయవరం : పాయకరావుపేటలో మే 1న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు మండలం నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేపట్టాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద మండల పార్టీ నాయకులతో శనివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ఇంతవరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రతి కార్యక్రమం పూర్తి స్థాయిలో సక్సెస్ అయిందని, అదేక్రమంలో పాయకరావుపేట బహిరంగ సభను కూడా విజయవంతం చేయాలన్నారు. గ్రామాల నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చిన వారికి రవాణా సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు శ్రీపతిరాజు, చోడిపల్లి కోదండం, పోలిశెట్టి సతీష్, కర్రి వరహాలరావు, శిగటాపు అప్పారావు, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, గాడి అప్పల నరసింహరావు, పాలపర్తి పాపారావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, ఎంపీటీసీలు బాల సూరిబాబు, చొప్పా రాజు పాల్గొన్నారు.

ఐదు గ్రామాల్లో పోలీసుల కవాతు

మాకవరపాలెం : ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఐదు గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. మండలంలోని భీమబోయినపాలెం, శెట్టిపాలెం, రాచపల్లి, మాకవరపాలెం, తామరం గ్రామాల్లో శనివారం ప్రత్యేక పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామకృష్ణారావు మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఎవరి ప్రలోభాలకు, ఒత్తిడులకు, హెచ్చరికలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎన్నికల్లో ప్రజలకు భరోసా కల్పించేందుకే గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహిస్తున్నామన్నారు.

జగనన్న అంటేనే నమ్మకం

చేయూత కొనసాగింపు.. ఆనందం రెట్టింపు



వైఎస్సార్ చేయూత పథకం కింద 45 ఏళ్లు నిండిన అక్క చెల్లెమ్మలకు ప్రతి ఏటా ఇచ్చే ఆర్థిక సాయం మరో ఐదేళ్లు కొనసాగిస్తామని, సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పడం ఎంతో ఆనందంగా ఉంది. నేను చేయూత డబ్బులతో పాన్‌షాపు నిర్వహిస్తున్నాను. ఆ పథకాన్ని కొనసాగించడం నాకెంతో ఉపయోగపడుతుంది. నవరత్నాలను కొనసాగిస్తూనే కొన్ని పథకాలకు ఇచ్చే ఆర్థిక సాయాన్ని పెంచడం ఎంతో మంచి నిర్ణయం. అమలు చేయగలిగిన పథకాలే ప్రకటించడం ఆయన నిజాయితీకి నిదర్శనం.

– తుమ్మా కల్పన, చేయూత లబ్ధిదారు, నక్కపల్లి

నిజాయితీకి నిదర్శనం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిజాయితీగా మేనిఫెస్టో విడుదల చేసి మరోసారి నిరూపించుకున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని ఎన్నికల తరువాత అమలు చేసే పథకాలు మాత్రమే నవరత్నాలు ప్లస్ అని ప్రకటించారని, పేద మధ్య తరగతి ప్రజలకు గడిచిన అయిదేళ్లలో నవరత్నాలు పేరిట అమలు చేసిన సంక్షేమ పథకాలు ఎంతో మేలు చేశాయి. ఇప్పుడు జగన్ మోహన్‌రెడ్డి అవ్వాతాతలకు పింఛను పెంపు, రైతు భరోసా పెంపు, అమ్మఒడి పెంపు వంటివి మళ్లీ అమలు చేసే దిశగా ఉన్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి అంటేనే నమ్మకం...మేనిఫెస్టో చాలా బాగుంది.

– చొప్పా రాజు , పెట్టుగోళ్లపల్లి (ఎస్.రాయవరం)

చేస్తాడనే నమ్మకముంది



నా పేరు బూకా అర్జమ్మ. మాది తామరం గ్రామం. నాకు రెండు ఎకరాల బంజరు భూమికి 20 ఏళ్ల క్రితం డీపట్టా ఇచ్చారు. ఈ భూమిలో జీడి, మామిడి పంటను సాగు చేస్తున్నాను. ఏటా రూ.10 వేల వరకు పెట్టుబడి అవసరం అవుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకముందు వడ్డీకి డబ్బులు తెచ్చి పెట్టుబడి పెట్టేదాన్ని. నాలుగేళ్లుగా ఏటా రైతు భరోసా పథకంలో రూ.13,500 నగదు అందుతోంది. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసా నగదును అందించారు. ఇప్పుడు ఇచ్చిన హామీని కూడా సీఎం జగన్‌బాబు నెరవేరుస్తారనే నమ్మకం ఉంది.

– బూకా అర్జమ్మ, తామరం, మాకవరపాలెం మండలం

మేనిఫెస్టో అంటే పవిత్ర గ్రంథం..చెప్పింది చేశాం... చేసేదే చెబుతాం...చంద్రబాబు వలే బూటకపు హామీలు ఇవ్వం..అని చెబుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, పేదలకు ఇళ్లు, మహిళా సంక్షేమం, సామాజిక భద్రతే ప్రధాన అంశాలు గా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టో –2024 ప్రకటించారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి నవరత్నాలు పేరుతో అందించిన సంక్షేమ పథకాలను కొనసాగించడంతో పాటు పలు పథకాల ద్వారా మరింత లబ్ధి చేకూరుస్తూ ఇచ్చిన మేనిఫెస్టో పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.



అన్ని వర్గాలకు ఆమోదయోగ్యం



సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో అద్భుతంగా ఉంది. 2019లో ప్రకటించిన మేనిఫెస్టో 99 శాతం నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిది. అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా మేనిఫెస్టో రూపొందించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించడం పేదలకు వరం. పేద, మధ్యతరగతి, ఉద్యోగులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

– దేవాడ సత్యనారాయణ (నర్సీపట్నం, శారదనగర్)

జగన్ బాబే కొండంత అండ



జగన్ బాబు ఏదైనా చెప్పారంటే అది కచ్చితంగా అమలు చేస్తారు. ఎలక్షన్ హామీలు చాలావి చెప్పారంట. అవి విన్నాక చాలా సంతోషమేసింది. జగన్‌బాబు సీఎం అయితే మాకు ఏ బెంగా ఉండదు. నాకు జగనన్న చేదోడు పథకంలో ఆర్థిక సహాయం అందింది. దాంతో కూరగాయల కొట్టు పెట్టుకున్నాను. ఈసారి గెలిచాక ఆర్థిక సహాయం కొనసాగిస్తానని చెప్పారు. చాలా ఆనందంగా ఉంది. మాలాంటోళ్లకు జగన్‌బాబే కొండంత అండ. ఆయనే మళ్లీ సీఎం అవుతారు.

– తమరాన సత్యవతి, లబ్ధిదారు, కె.వెంకటాపురం, కోటవురట్ల మండలం

మరింత లబ్ధి చేకూర్చేలా మేనిఫెస్టో



సీఎం జగన్ విడుదల చేసిన వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో చాలా బాగుంది. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా మేనిఫెస్టోకు రూపకల్పన చేశారు. జగన్ మేనిఫెస్టోను కచ్చితంగా నమ్ముతాం. చంద్రబాబులా బూటకపు హామీలుండవు. జగన్ రైతులకు చాలా అండగా ఉన్నారు. రైతు భరోసా ద్వారా నాకు ఐదేళ్లు నగదు అందింది. ఎటువంటి ఆర్భాటం లేకుండా పారదర్శకంగా బటన్ నొక్కి డబ్బులు మా అకౌంట్లలో వేస్తున్నారు. మళ్లీ జగనే రావాలి. ఆయన వస్తేనే రైతులు బాగుపడతారు.

– కొరుప్రోలు రమణ, రైతు, కె.వెంకటాపురం, కోటవురట్ల మండలం

మాట ఇస్తే.. చేస్తాడన్న మాటే...



ఇచ్చిన మాట నిలబెట్టుకొనే గొప్ప వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి. 2019లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాడు. 2024 ఎన్నికల సందర్భంగా శనివారం ఇచ్చిన ప్రతి హామీ నూరుశాతం నెరవేర్చడం జరుగుతుంది. ఇటువంటి గొప్ప నాయకుడు గెలుపుకోసం పనిచేస్తాం. పేద ప్రజల కోసం అమ్మఒడి, రైతు భరోసా, చేయూతతో పాటు అన్ని పథకాలు పెంపు చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇటువంటి గొప్ప నాయకుడుని ప్రభుత్వమే మళ్లీ రావాలి.

– పరవాడ నూకినాయుడు, లింగంపేట, రైతు (గొలుగొండ)

విద్యార్థులకు వరం



ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అన్ని విధాలుగా చేయూత ఇచ్చినట్లుంది. అమ్మ ఒడి పథకంలో ఇప్పుడు ఇచ్చే దాని కంటే అదనంగా పెంచనున్నట్టు మేనిఫెస్టోలో చేర్చారు. ఇది ప్రతి తల్లిదండ్రులకు ఎంతో భరోసా ఇచ్చినట్లుగా ఉంది. నాడు నేడు పథకంలో పాఠశాలలు అభివృద్ధి చేశారు. అమ్మఒడి పెంచడంతో జగన్‌మోహన్‌రెడ్డి పట్ల మరింత నమ్మకం పెరిగింది. జగన్ మాట ఇస్తే కచ్చితంగా అమలు చేస్తారు.

– పైల రామలక్ష్మి విద్యార్థి తల్లి నాతవరం హైస్కూల్ (నాతవరం)

డ్వాక్రా సంఘాలకు మేలు



డ్వాక్రా సంఘాలకు రూ.3 లక్షల రుణాలకు రాయితీ ఇస్తానని మేనిఫెస్టోలో పెట్టడం చూస్తే డ్వాక్రా సంఘాలు మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయి. గతంలో వైఎస్సార్ ఆసరా పథకం 2019లో చెప్పినట్టుగా యథావిధిగా అమలు చేసి చూపారు. అక్కా చెల్లెమ్మలు ఆనందంగా ఉన్నారు. ఇపుడు ఆనందం మరింత రెట్టింపు చేసేలా మేనిఫెస్టో ఉంది. జగన్‌పై నమ్మకం ఉంది.

– పోలుపర్తి రాధ, డ్వాక్రా మహిళ (నాతవరం)

సబ్‌జైల్‌ను తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి

నర్సీపట్నం : స్థానిక సబ్‌జైల్‌ను మండల న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పటాన్ సీయాజ్ ఖాన్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూధన్‌రావు శనివారం తనిఖీ చేశారు. ఖైదీలకు తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బెయిల్ పెట్టుకునేందుకు ఆర్థిక స్తోమత లేనివారికి మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయం అందిస్తామన్నారు. అటువంటి వారు ఎవరైనా ఉంటే వివరాలు జైల్ సూపరింటెండెంట్ ద్వారా తెలియజేయాలన్నారు.

అందరి సంక్షేమానికి ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలి



పుత్తడిగైరంపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గణేష్ సతీమణి కళావతి

గొలుగొండ : పేదల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి , ఇచ్చిన మాట తప్పకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సతీమణి కళావతి తెలిపారు. పుత్తడిగైరంపేట గ్రామంలో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు, పవన్, బీజేపీల మాయమాటలు నమ్మవద్దన్నారు. ఫ్యాన్ గుర్తికి వేసి జగనన్ననే గెలిపించాలని కోరారు. నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలో ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ పరిష్కరించారని తెలిపారు. మండల ప్రజలకు అత్యంత సమస్యగా ఉన్న ఆరిల్లోవ రోడ్డు పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఎంపీగా బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యేగా పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. గ్రామంలో మహిళలు ఆమెకు సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సచివాలయం కన్వీనర్లు సంఘం అధ్యక్షులు పాణీ శాంతారామ్, ఎంపీటీసీ యాళ్ల లక్ష్మీదుర్గాతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధికి ఓటుతో మద్దతు తెలపండి

- పథకాలతో అందరికీ న్యాయం చేశాం
- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నాయకులతో కలిసి వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గణేష్



ప్రచారంలో ఓటర్లకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం : నియోజకవర్గ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టామని..దీనికి ప్రజలు ఓటుతో తమకు మద్దతు తెలపాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ 19వ వార్డు బయపురెడ్డిపాలెంలో పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, వార్డు కౌన్సిలర్ బయపురెడ్డి చినబాబుతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం చేపట్టారు. వార్డు ప్రజలు ఎమ్మెల్యేపై పూల వర్షం కురిపించారు. ఏ ఇంటికి వెళ్లినా మహిళలు హారతులిచ్చి బ్రహ్మరథం పట్టారు. ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, తనకు ఓట్లు వేసి ఆదరించాలని విన్నవించారు. ఐదేళ్లలో వార్డు చేపట్టిన అభివృద్ధికి చేపట్టిన పనులు, సంక్షేమ పథకాల అమలకు చేసిన కృషిని వివరించారు. దీనిపై ప్రజలు తమ వార్డులో గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి చెందాయని, తమ ఇళ్ల వద్దకే పాలన వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఐదేళ్ల క్రితం సమస్యల పరిష్కారానికి మండల కేంద్రానికి వెళ్లి అధికారులకు చెప్పుకోవాల్సి వచ్చేదని, సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో అధికారులు తమ వద్దకు వచ్చి పని చేస్తున్నారని వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో కుల మతాలు, పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాల ద్వారా న్యాయం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ పార్టీ అధ్యక్షులు ఏకా శివ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషా బేగం, కర్రి శ్రీనువాసరావు, పార్టీ టౌన్ మహిళా అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు ఓటుతో మద్దతివ్వండి



పాయకరావుపేట బృందావనంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

పాయకరావుపేట: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయానికి అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని నాయకులు ప్రశాంతినగర్, బృందావనం నందు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మాజీ మండల అధ్యక్షులు ధనిశెట్టి బాబూరావు ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రకటించి, అమలు చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. నాడు – నేడు ద్వారా పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆధునికీకరణ చేసి, అందరికీ విద్య, వైద్యం అందించడం జరిగిందని తెలిపారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, చేయూత, ఆసరా, అమ్మ ఒడి, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, నేతన్న నేస్తం, వాహన మిత్ర, రైతు భరోసా వంటి పథకాలు ద్వారా ఆర్థికంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసి అందరికీ ఉన్నత, విదేశీ విద్య కల్పిస్తున్నారన్నారు. ప్రతి ఓటరుకు పథకాలపై అవగాహన కల్పిస్తూ ఫ్యాన్ గుర్తు, బ్రోచర్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యేగా కంబాల జోగులును, ఎంపీగా బూడి ముత్యాల నాయు డును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, వార్డు సభ్యులు పిరాధి రాజు, జగతా శ్రీను, పార్టీ నాయకులు కేశనకుర్తి సత్తిబాబు, నెలపర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తారు రోడ్డు పనులు ప్రారంభం



ఆరిల్లోవ అటవీప్రాంతంలో తారు వేస్తున్న దృశ్యం

గొలుగొండ: నర్సీపట్నం-కృష్ణదేవిపేట ప్రధానరోడ్డు మార్గంలో ఉన్న ఆరిల్లోవ అటవీప్రాంతంలో నిర్మాణం జరుగుతున్న రోడ్డుకు తారువేసే పనులు శనివారం ప్రారంభం అయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణానికి సుమారుగా రూ.6 కోట్లు నిధులు మంజూరు కాగా ఆరునెల ల క్రితం మొదటి దశ పనులు చేయడం జరిగింది. ఈ రోడ్డు నిర్మాణానికి తారు వేస్తున్నట్లు ఆర్అండ్‌బీ జేఈ ప్రసాద్ తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం జరుగుతుండడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారుగా 100 ఎళ్ల నాటి సమస్య ప్రస్తుతం నెరవేరడంతో ప్రజలు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 40 సంవత్సరాలు సుదీర్ఘ రాజకీయం చేసి ఎన్నో మంత్రి పదవులు పొందిన టీడీపీ నేత అయ్యన్న సైతం ఏమీ చేయలేక చేతులెత్తగా కేవలం ఐదు సంవత్సరాలు ఎమ్మెల్యేగా పనిచేసి ప్రజలకు ఎంతో అవసరం అయిన ఈ రోడ్డు నిర్మాణానికి ఎంతో కృషి చేసి నిధులు మంజూరు, అటవీశాఖ అనుమతులు తీసుకువచ్చిన పెట్ల ఉమా శంకర్ గణేష్‌కు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. మరో వారం రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేస్తున్నట్టు అధికారులు తెలుపుతున్నారు.

మళ్లీ జగనే సీఎం కావడం ఖాయం

ఎంబీపట్నంలో ప్రచార సభలో సినీ హీరో పెట్ల సాయి శంకర్



పురవీధుల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న సినీ హీరో పెట్ల సాయిశంకర్

నాతవరం : వైఎస్సార్‌సీపీకి ప్రజలు వస్తున్న అదరణ చూస్తే మళ్లీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజయం ఖాయమని సినీ హీరో పెట్ల సాయి శంకర్ అన్నారు. మండలంలో ఎంబీ పట్నం పంచాయతీలో శనివారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌కు మద్దతుగా సోదరుడు పెట్ల సాయిశంకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు, సినీ హీరో మొదటిసారి గ్రామంలోకి రావడంతో గ్రామస్తులు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. సాయి శంకర్ గ్రామంలో ఉత్సాహంగా ర్యాలీగా తిరుగుతూ మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేగా పెట్ల ఉమా శంకర్ గణేష్‌కు, అనకాపల్లి పార్లమెంటు సభ్యుడుగా బూడి ముత్యాలనాయుడుకు రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు నిర్మించి గ్రామంలోనే ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తున్నారన్నారు. వైస్ ఎంపీపీ పైల సునీల్, గ్రామ సర్పంచ్ కాళ్ల ఝాన్సీరాణి, ఎంపీటీసీ సభ్యులు పల్లి రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అడిగర్ల నాయుడు, విశ్రాంత వ్యవసాయ శాఖ జేడీ వర్రే వెంకటేశ్వరరావు, నాయకులు వర్రే రవి, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు నర్సింగరావు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, వర్రే చరణ్, కర్రి వెంకటరమణ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన వారికే ఓటు వేయండి



జోగులుకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మత్స్యకారులు

- మత్స్యకార గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రచారం
- కంబాల జోగులుకు గంగపుత్రుల బ్రహ్మరథం

నక్కపల్లి : గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నూరు శాతం నెరవేర్చిన వారికే ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులు, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు కోరారు. శనివారం వారు పెదతీనార్ల, చినతీనార్ల, దొండవాక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగపుత్రులు వైఎస్సార్‌సీపీ నాయకులకు బ్రహ్మరథం పట్టారు. తీన్మార్ డప్పులతో గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చిన ఘనత ఒక్క వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టోను మాయం చేసే చంద్రబాబు లాంటి వ్యక్తులను మళ్లీ ఎన్నుకుంటే అధోగతి పాలవుతామన్నారు. గత ఎన్నికల ముందు చెప్పినవి, చెప్పనవి కూడా అమలు చేసిన ఘనత జగనన్న ప్రభుత్వానిదేనన్నారు. టీడీపీ బీసీలు, ఎస్సీలను ఓటు బ్యాంకుగా వాడుకుందన్నారు. ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అనిత 2014లో ఇచ్చిన హామీలను ఒక్కటైనా నెరవేర్చిందా? అని ప్రశ్నించారు. డిగ్రీ కళాశాల, 50 పడకల ఆస్పత్రి వంటి హామీలు ఇచ్చారని, ఆమె నెరవేర్చకపోవడంతో 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత మా ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. గంగపుత్రులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే నష్ట పరిహారం కూడా అరకొరగా ఇచ్చే వారన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ఒకేసారి రూ.10వేలకు పెంచి వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. డీజిల్‌పై సబ్సిడీ కూడా పెంచడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో మత్స్యకారుల వలసలు నిరోధించడానికి మత్స్య సంపదను మార్కెటింగ్ చేసుకునేందుకు వేలాది మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించేందుకు రూ.42 కోట్లతో ఫిష్‌లాండింగ్ సెంటరు మంజూరు చేయడం జరిగిందన్నారు. పార్టీల కతీతంగా వర్గాల కతీతంగా కులాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాల వారు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందారన్నారు. తెలుగుదేశం పార్టీ బూటకపు వాగ్దానాలు, హామీలకు పథకాలకు మరోసారి మోసపోవద్దన్నారు. కడప నుంచి వచ్చిన పెత్తందార్లు ఇక్కడ సంపదను దోచుకోవడానికి ఎంపీగా పోటీ చేస్తున్నారన్నారు. స్థానికంగా బలమైన సామాజిక వర్గానికి చెందిన బూడి ముత్యాల నాయుడిని ఎంపీగాను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహామూర్తి, సర్పంచ్‌లు ఎరిపల్లి ముసలయ్య, మైలపల్లి శ్రీను, మాజీ సర్పంచ్‌లు ఎరిపల్లి శ్రీను, కొర్లయ్య, జేసీఎస్ కన్వీనర్లు గోవిందు, నాయకులు బొల్లం బాబ్జి, గొర్ల బాబూరావు, కారే దాసు పాల్గొన్నారు.